సాక్షి
నంద్యాల
ఆదివారం । 17 । నవంబర్ । 2024



మద్దిలేటయ్యలో భక్తుల సందడి

బేతంచెర్ల: కార్తీక మాసం మూడవ శనివారం సందర్భంగా మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా శనివారం నిత్య కళా వేదికపై గుంటూరుకు చెందిన జి. విజయగౌరి బృందం ప్రదర్శించిన సంప్రదాయ నత్యప్రదర్శన భక్తులను అలరించింది.



అన్న ప్రసాదానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల నిత్య అన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన సూర్యదేవి, ఒంగోలుకి చెందిన ఎం.శేఖర్ వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

చౌడేశ్వరిదేవి హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ హుండీల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, పర్యవేక్షణాధికారి హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి ఇప్పటి వరకు వేసిన కానుకలను లెక్కించారు. మొత్తం రూ.18,27,724 నగదు ఉందని, బంగారం, వెండి వస్తువులను ఇంకా లెక్కించాల్సి ఉందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ బాబు, ఆళ్లగడ్డ సేవ సమితి సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

875.20 అడుగులకు శ్రీశైల జలాశయ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయ నీటిమట్టం శనివారం సాయంత్రం సమయానికి 875.20 అడుగులకు చేరుకుంది. నీటినిల్వ 164.7532 టీఎంసీలకు చేరుకున్నాయి. సుంకేసుల నుంచి 6,759 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలానికి అతిస్వల్పంగా 584 క్యూసెక్కుల నీరు రాగా జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 13,952 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 1.816 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

హైడల్ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న హైడల్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనీయా శనివారం సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణం పనులు ఎంత మేర పూర్తి అయ్యాయి.. ఇంకా చేయాల్సిన పనులు ఏమున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రాజెక్టు కోసం సేకరించిన భూముల వివరాలు, రైతులకు చెల్లించిన పరిహారం తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కంపెనీ అధికారులు నాయుడు పాల్గొన్నారు.

25న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు (అర్బన్): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శనివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, విద్యుత్, నీటిపారుదల శాఖలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఇన్‌చార్జ్ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్‌తో పాటు పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరుకావాలని సీఈఓ కోరారు.

న్యాయంపై కాలకూటమి విషం!



- లోకాయుక్త, హెచ్ఆర్సీని అమరావతికి తరలిస్తున్న ప్రభుత్వం
- అన్నీ తెలిసి న్యాయ సంస్థలు కర్నూలులోనే ఉంటాయని మంత్రి టీజీ భరత్ ప్రకటన
- మంత్రి ప్రకటనపై సీమ వాసుల విస్మయం
- నోరు మెదపని న్యాయ శాఖ మంత్రి
- అడ్డుకోవాల్సిన కూటమి ప్రజా ప్రతినిధులు, నేతలు మౌనం
- పోరాటానికి ప్రతిపక్ష పార్టీలు, న్యాయవాదుల కార్యాచరణ

సీమ ప్రజల ఆకాంక్ష. ఎన్నో ఏళ్లుగా పోరాటం. న్యాయం కోసం న్యాయవాదులు, మేధావులు గళమెత్తారు. పెద్ద మనుషుల ఒప్పందం జరిగి తీరాల్సిందేనని పట్టుబట్టారు. ఐదేళ్ల క్రితం వారి ఆశలు చిగురించాయి. సీమ ముఖద్వారంలో న్యాయదేవతకు నీరాజనం పలికారు. ఒక్కో అడుగు పడుతుండటంతో కల నెరవేరుతుందని అందరూ ఆనందపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సీమకు అంతులేని అన్యాయం జరుగుతున్నా అడిగేనాథుడు లేరు. అడ్డుకోవాల్సిన కూటమి ప్రజా ప్రతినిధులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. ఎన్నికల ముందు బీరాలు పలికిన నేతలు ఇప్పుడు మౌనం దాల్చుతున్నారు. – సాక్షిప్రతినిధి కర్నూలు

దాదాపు ఏడు దశాబ్దాల పోరాటానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలును 'న్యాయ రాజధాని'గా ప్రకటించింది. ఆ వెంటనే లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, వక్ఫ్‌ట్రిబ్యునల్, ఏపీఈఆర్సీ, సీబీఐ కోర్టును ఏర్పాటు చేసింది. 'జ్యూడీషియల్‌సిటీ' ఏర్పాటుకు సిద్ధమైంది. జాతీయ న్యాయ యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగింది. ఇవన్నీ ఇప్పుడు కళ్లెదుటే తరలిపోతున్నాయి. అయినా మంత్రులు, కూటమి ప్రజా ప్రతినిధులు ఒక్కరూ కూడా నోరు మెదపడం లేదు. గతంలో ప్రాంత ప్రయోజనాలే ప్రాధాన్యతగా నేతలు రాజకీయాలు చేశారు. ప్రాంతానికి అన్యాయం జరిగితే పార్టీలకు రాజీనామాలు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో కూడా పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే, ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి ఏకమై సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నిర్మించారు. ఇప్పటి ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన 'సీమ'కు కొత్త సంస్థలు తీసుకురాకపోగా ఉన్నవాటిని తరలిస్తామని చెబుతుంటే, హైకోర్టు ఏర్పాటు కాదు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తుంటే అధికార పార్టీకి చెందిన ఏ ఒక్కరూ గళం విప్పలేదు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మాత్రమే దీనిని ప్రశ్నిస్తోంది. ఆపార్టీ నేతలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, సమైక్యాంధ్ర జేఏసీ కన్వీనర్‌గా పని చేసిన శైలజానాథ్, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి వీటి తరలింపునకు వ్యతిరేకంగా ప్రకటనలు చేశారు. ఇప్పటికే ఏర్పాటైన సంస్థలను మరో ప్రాంతానికి తరలించడమంటే ఇక్కడి అభివృద్ధిని అడ్డుకోవడమే అని 'సీమ' మూకుమ్మడిగా ఖండిస్తోంది. అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షలు చేస్తామని మేయర్ రామయ్య ప్రకటించారు. దీనిపై న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి వినతిపత్రం కూడా సమర్పించారు.



నేషనల్ లా యూనివర్సిటీ శంకుస్థాపనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, లోకాయుక్త, హెచ్ఆర్సీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు

మొదటి నుంచి టీడీపీ వ్యతిరేకమే!

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 'సీమ' హక్కు అనే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ ప్రముఖులందరికీ తెలుసు. మద్రాసు రాష్ట్రంలో కాశీనాథుని నాగేశ్వరరావు ఇంట్లో (శ్రీబాగ్) తెలుగు రాష్ట్రానికి చెందిన అన్ని ప్రాంతాల పెద్ద మనుషుల మధ్య 1937 నవంబర్ 16న జరిగిన ఒప్పందం. అయితే ఆయా రాజకీయ పార్టీలు, నేతలు తమ రాజకీయ స్వలాభం కోసం 'ప్రాంతీయహక్కు'ను పణంగా పెట్టారు. దీంతోనే 'సీమ' వాణిని గట్టిగా వినిపించలేక పోయారు. దాని ఫలితమే ఏడు దశాబ్దాలుగా హైకోర్టు ఏర్పాటు కాలేదు. చివరకు 2019లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై ప్రకటన చేశారు. 'సీమ' భవిష్యత్తు కాంక్షించే అన్ని రాజకీయపార్టీలు ఈ నిర్ణయాన్ని స్వాగతించాల్సింది పోయి కొన్ని వ్యతిరేకించాయి. అప్పుడు ప్రతిపక్షనేత నేత చంద్రబాబు హైకోర్టు అమరావతిలో నిర్మించాలని పట్టుబట్టారు. ఆ సమయంలోనే జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు 'న్యాయరాజధాని'కి సహకరించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు నినదించాయి. రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధాని, మూడు రాజధానులు వద్దు అని హైకోర్టుకు వ్యతిరేకంగా చంద్రబాబు ప్రకటన చేశారు. గాయత్రి ఎస్టేట్‌లోని టీడీపీ కార్యాలయం బయట టీడీపీ కార్యకర్తలతో అమరావతికి అనుకూలంగా నినాదాలు చేయించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. హైకోర్టు ఏర్పాటు చేస్తామని అప్పటి ప్రభుత్వం నిర్ణయిస్తే, బెంచ్ ఎందుకు? అని ఏ ఒక్క టీడీపీ నాయకుడు చంద్రబాబుకు విన్నవించలేక పోయారు.

న్యాయశాఖ మంత్రి ఉన్నా ..

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలలో ముగ్గురు చొప్పున వైఎస్సార్ జిల్లాలో ఒక్కరు మొత్తం ఏడుగురు మంత్రులు 'సీమ' వాసులున్నారు. ముఖ్యమంత్రి కూడా 'సీమ' వాసే! అందులో న్యాయశాఖ మంత్రి, ఆర్థికశాఖ మంత్రి ఉన్నారు. న్యాయశాఖ మంత్రి నంద్యాల వాసి అయి కూడా 'న్యాయసంస్థలు' తరలిస్తుంటే చోద్యం చూడటం బాధాకరం.

నాడు అడ్డుపడినా ఆగలేదు..

'న్యాయరాజధాని'కి వ్యతిరేకంగా చాలా మంది కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడ్డారు. దీంతో హైకోర్టు నిర్మాణానికి కాస్త జాప్యం జరిగింది. అయితే ఆ దిశగా అడుగులు వేసేందుకు లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, వక్ఫ్‌ట్రిబ్యునల్, ఏపీఈఆర్సీ, సీబీఐ కోర్టును వైఎస్ జగన్ ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేసింది. ఆపై జగన్నాథగట్టుపై 273 ఎకరాల్లో 'జ్యూడీషియల్‌సిటీ' ఏర్పాటుకు సిద్ధమైంది. అక్కడే హైకోర్టుతో పాటు ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలని భావించింది. దీనికి మంత్రి వర్గ ఆమోదం లభించింది. అందులో 100 ఎకరాల్లో రూ. వెయ్యికోట్లతో నేషనల్ లా యూనివర్సిటీని నిర్మించేందుకు భూమిపూజ కూడా చేశారు. ఈ క్రమంలో లోకాయుక్త, హెచ్ఆర్సీని కర్నూలులో ఏర్పాటు చేయడంపై మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యంపై ఈ నెల 13న హైకోర్టు ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ఆ రెండు సంస్థలను అమరావతికి తరలించేలా నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం ధర్మాసనానికి తెలియజేసింది.



హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే

"కర్నూలులో బెంచ్ కాదు హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందే. ఇది ఈ ప్రాంత హక్కు. ఇది పార్టీలకు సంబంధించిన సమస్య కాదు. వెనుకబడిన రాయలసీమకు న్యాయం జరగాలి. ఏర్పాటైన న్యాయసంస్థలను ఎలా అమరావతికి తీసుకుపోతారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటును గతంలో అన్ని పార్టీలు అంగీకరించాయి. ఇప్పుడు ఏర్పాటు అవుతుంటే అడ్డుపడటం అన్యాయం కాదు ద్రోహం. 'సీమ' జిల్లాలలోని అన్ని రాజకీయపార్టీలు, సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి తరలింపును అడ్డుకోవాలి. దీనిపై తప్పకుండా ఉద్యమిస్తాం.

– శైలజానాథ్, పీసీసీ మాజీ అధ్యక్షులు

మంత్రి గారూ... మీకు అర్థమవుతోందా!?



లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) కార్యాలయాలను కర్నూలు నుంచి అమరావతికి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో దీనికి సంబంధించి చట్టసవరణ చేస్తాం. ఆపై తరలింపు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

– ఈ నెల 13న హైకోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

'లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ కర్నూలులోనే ఉంటాయి. ఇప్పటికే నెలకొల్పిన సంస్థలు తరలించబోం. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించాం. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం'

– ఈ నెల 15న మంత్రి టీజీ భరత్ ప్రకటన

పై రెండు ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే 'న్యాయసంస్థల' తరలింపుపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని తెలిసి కూడా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలను మభ్యపెట్టేలా ప్రకటన చేశారు ఓవైపు లోకాయుక్త, హెచ్ఆర్సీని అమరావతికి తలించే నిర్ణయం తీసుకున్నామని ఏకంగా హైకోర్టుకు ప్రభుత్వం స్పష్టం చేసిన తర్వాత కూడా మంత్రి భరత్ ఇలాంటి ప్రకటన చేయడం హాస్యాస్పదం! పైగా గత ప్రభుత్వం కర్నూలులో హైకోర్టుతో పాటు జ్యుడీషియల్ సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటే, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని అదేదో గొప్ప ఘనతలా మంత్రి చెప్పడం శోచనీయం. కళ్లెదుటే అన్యాయం జరుగుతున్నా ఎవరిలోనూ పోరాటం కనిపించడం లేదు.

వినతుల పరిష్కారానికి కృషి చేస్తా

నంద్యాల(వ్యవసాయం): స్థానిక న్యాయవాదుల విన్నపాలను తనవంతుగా పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా జడ్జి కబర్ది అన్నారు. శనివారం ఆయన నంద్యాల కోర్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోర్టులో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లను ప్రారంభించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కోర్టు రికార్డులను భద్ర పరిచేందుకు డిజిటలైజేషన్ చేస్తున్నామన్నారు. త్వరలో నంద్యాల కోర్టులో జిల్లా కోర్టు, ఫ్యామిలీ, ఎన్ఐ యాక్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టులతో పాటు బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు త్వరితగతిన పరిష్కారామయ్యేలా న్యాయవాదులు సహకరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్ది

కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి వాసు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండో అదనపు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూమా వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, శ్రీదేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): బీసీ స్టడీ సెంటర్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తాక్‌అహమ్మద్ అన్నారు. స్థానిక రామకృష్ణ విద్యాలయంలో శనివారం ఉచిత శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అభ్యర్థులు ప్రణాళికతో చదువుకుని ఉపాధ్యాయ పోస్టులు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఓబులేసు, గోవర్ధనయ్య, ప్రిన్సిపాల్ మునిశేఖర్, నాగేంద్ర, సంక్షేమ అధికారులు మునిరాజ్, సువర్ణ, ముంతాజ్‌భేగం, సురేష్, వేణుగోపాల్, వెంకటపతి, గంగాధర్‌గౌడ్, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

డీఎస్సీ -2024 ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును ఈనెల 19 వరకు పొడిగించినట్లు నంద్యాల జిల్లా బీసీ సంక్షేమ అధికారి ముస్తాక్ అహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలని, టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు స్థానిక బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లోని జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారత అధికారి కార్యాలయంలో లేదా సెల్: 9989003020, 8074461664 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేలరాలిన ఆశలు!

దొర్నిపాడు: వరి రైతుల కష్టం వర్షార్పణమైంది. ఎన్నో ఆశలతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట తుపాను ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వానలకు నేలకొరిగింది. పంట చేతికి వచ్చిన వేళ ఈ పరిస్థితి ఉత్పన్నం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పైరు నేలకొరగడంతో గింజలన్నీ రాలిపోతున్నాయని వాపోతున్నారు. శనివారం క్రిష్టిపాడు గ్రామం కుందూతీరంలో వర్షంతో పాటు ఈదురుగాలులు వీచడంతో నన్నెసాబ్ అనే రైతుకు చెందిన పంట పొలం నేలకొరిగిన దృశ్యమిది.



దొర్నిపాడు సమీపంలో నేలకొరగిన వరి పైరు చూపుతున్న రైతు

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- నందికొట్కూరులోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీలో డీఈఓ

నందికొట్కూరు: ఈసారి ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్, సంతపేట స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు కింద చేపట్టిన ఉర్దూ పాఠశాల నిర్మాణాలను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సుభాన్‌ను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక తరగతులు తీసుకొని ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చూడాలన్నారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరగాలని, అందుకు అనుగుణంగా మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో అపార్ నమోదు ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు.



జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ

బాలికల జెడ్పీ హైస్కూల్‌లో గుడ్డు మాయంపై విచారణ

బాలికల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్డు ఇవ్వడం లేదని విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనపై డీఈఓ స్పందించారు. ఎందుకు గుడ్డు ఇవ్వడం లేదని శనివారం హెచ్ఎం పార్వతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం పదో తరగతి గదిలో విద్యార్థులతో డీఈఓ ముచ్చటించారు. ఇష్టంతో చదువుకుంటే మంచి మార్కులు వస్తాయని చెప్పారు.

యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్

కర్నూలు (అర్బన్): యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్షుమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు తమ కార్యాలయంలో దరఖాస్తులను తీసుకుని పూర్తి చేసి రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు తదితర జిరాక్స్ కాపీలతో ఈనెల 24వ తేదీ లోపు అందజేయాలన్నారు.

నల్లమలకు సాంకేతిక రక్ష!

- పులుల సంరక్షణకు అత్యాధునిక కెమెరాలు
- ఎంపీ 4 వీడియో, ఆడియో టు వే సైరన్ సిస్టం
- అడవిలోని ప్రతి జీవి కదలికపై నిఘా
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా నాగలూటి, ఆత్మకూరు అటవీరేంజ్‌లలో అమలు

ఆత్మకూరురూరల్: మన జాతీయ జంతువు పులి. ఆహారపు గొలుసులో అగ్రస్థానంలో ఉండే వీటిని సంరక్షించుకొని..భవిష్యత్తు తరాలకు చూపించాల్సిన అవసరం ఉంది. ఈ ఉద్దేశంతోనే నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం అధికారులు పులుల సంరక్షణకు పలు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు పులుల జాడ, కదలికలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. తాజాగా నల్లమలలోని ప్రతి కదలిక కళ్ల ముందు కనిపించేలా సౌరశక్తితో పని చేసే అత్యాధునిక కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



నాగలూటి రేంజ్‌లోని బేస్‌క్యాంప్ సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఆధునిక కెమెరా

మూడోతరం కెమెరాలో అనేక ప్రత్యేకతలు

నల్లమలలో విధులు నిర్వహించే అధికారులు మొదట్లో చేత్తో పట్టుకు తిరిగే కెమెరాలతో అడవి జంతువులను రహస్యంగా ఫొటోలు తీసేవారు. వీటిని మొదటి తరం కెమెరాలు అనేవారు. తర్వాత ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు వచ్చాయి. వీటిని జంతు సంచారం ఉంటుందనుకునే ప్రదేశాల్లో రెండువైపులా చెట్లకు కట్టి ఉంచుతారు. ఆ కెమెరాల ముందు నడిచి వెళ్లే జీవి శరీర ఉష్ణోగ్రతకు కెమెరా నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు (ఇన్‌ఫ్రారెడ్)తాకిన వెంటనే ఆటోమెటిక్‌గా కెమెరా క్లిక్ అయి అందులో ఉన్న మెమోరీ కార్డులో ఆ చిత్రం నిక్షిప్తమవుతుంది. నిర్ణీత సమయాల్లో ఆ మెమోరీ కార్డు నుంచి సేకరించిన చిత్రాలను విశ్లేషించి రికార్డు చేయడం పులి సంరక్షణంలో ఒక పెను మార్పుకు దారి తీసింది. తాజాగా మనిషి వేలి ముద్రల లానే పులి చర్మంపై ఉండే చారలు వేటికవే ప్రత్యేకం కావడంతో పులి చారలను బట్టి పులుల సంఖ్యను నిర్ధారించే సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేశారు. ఇటీవల ఎస్ఎస్‌టీఆర్ ఆత్మకూరు డివిజన్ నాగలూటి రేంజర్ దొరస్వామి అత్యంత ఆధునికమైన సోలార్‌మినీ పాన్ – టిల్ట్ కెమెరాలను తన రేంజ్‌లో ప్రవేశ పెట్టారు. ఎంపీ 4 వీడియో, ఆడియో టు వే సైరన్ సిస్టం కలిగిన ఇవి రాత్రి పగలు తేడా 360 డిగ్రీల కోణంలో క్వాలిటీతో ఫొటోలను తీస్తాయి. తనముందు వెళుతున్నది మనిషి అయితే వెంటనే సంబంధిత అధికారికి అలర్ట్ మెసేజ్ పంపుతాయి. ఈ కెమెరాను పర్యవేక్షించే వారు ఉన్న చోటి నుంచి వెంటనే బెదిరింపు సైరన్‌ను వినిపించ వచ్చు. అంతేకాదు ఈ కెమెరాలు నిరంతరాయంగా తనముందు వెళ్లే ప్రతి జంతువు, మనిషి ఫొటోలు తీసి మనం అనుసంధాని ంచిన మెయిల్‌కు పంపుతాయి. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ కెమెరాలను ఇటీవలే ప్రయోగాత్మకంగా నా లులూటి అటవీ రేంజ్ పరిధిలో నాలుగు, ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో రెండు ఏర్పాటు చేశారు.



కెమెరా తీసిన పులి చిత్రం

కెమెరాలతో సంరక్షణ మరింత సులభం



పులుల సంరక్షణ పర్యవేక్షణకు ఇన్‌ఫ్రా రెడ్ కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. ఇటీవల మరింత మెరుగైన కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ధర కాస్త ఎక్కువే అయినా నల్లమలలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఈ కెమెరాల ఏర్పాటు వల్ల పులుల సంరక్షణ మరింత సులభమవుతుంది.

– సాయిబాబా, డీడీపీటీ,ఆత్మకూరు డివిజన్

దశాబ్దంలో పులి సంతతిలో అద్భుత ప్రగతి

2014 నాటికి నల్లమలలో 35 పెద్దపులులు మాత్రమే ఉండేవి. ఇవి క్రమేపి పెరుగుతూ 2024 నాటికి 87 కావడం అన్నది పులుల సంరక్షణలో ఒక అద్భుతమని చెప్పవచ్చు. 87 పులులను కచ్చితంగా గుర్తించడంలో సాంకేతికత ఎంతో ఉపయోగ పడింది. 87 పెద్దపులులను వాటికుండే కోడ్‌తో సహా చిత్రాలను కూడా అటవీ అధికారులు సేకరించారు. అడవుల్లో మానవ సంచారాన్ని దాదాపు శూన్యం చేయడం (చెంచులకు మినహాయింపు), అక్రమంగా చెట్ల నరికివేతను నిరోధించడం, పులి ఆహార జంతువుల నిష్పత్తి పడిపోకుండా చూడడం వంటి చర్యలు దశాబ్ద కాలంలో పులుల సంఖ్య పెరుగుదలకు కారణమయ్యాయి. నల్లమల వెయ్యి పులులకు ఆశ్రయం ఇవ్వగల అటవీ ప్రాంతమని, ఇది భవిష్యత్తులో సాకారమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మద్దిలేటయ్య ఆదాయం రూ.4,85,492

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి కార్తీక మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల సేవల ద్వారా ఆలయానికి రూ.4,85,492 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు.

ఆరుగురి మట్కా నిర్వాహకులపై కేసు

బొమ్మలసత్రం: ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని రేవనూరు, శిరివెళ్ల ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా శనివారం ప్రకటనలో తెలిపారు. మట్కా నిర్వాహకులు సురేష్‌గౌడ్, హుస్సేన్‌బాషా, చిన్న యాకోబు, వెంకటరమణ, సురేష్, జర్మియలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,65,317 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మట్కా నిర్వాహకులను అరెస్ట్ చేసిన శిరివెళ్ల సీఐ వంశీధర్, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, రేవనూరు ఎస్సై భూపాలుడులను ఎస్పీ అభినందించారు.

వాటర్ వర్క్స్ ఉద్యోగికి షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (టౌన్): వాటర్ వర్క్స్ ఉద్యోగికి శనివారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాటర్ వర్క్స్‌లో బోర్‌వెల్ పనులు చేసే జబ్బార్‌ఖాన్ పనివేళల్లో సచివాలయాన్నే అడ్డాగా మార్చుకొని మద్యం తాగుతున్న విషయాన్ని ఈనెల 15న సాక్షి 'విధుల్లోనే తప్పతాగి.. ఆఫీసునే బారుగా మార్చుకున్న ఉద్యోగి' అంటూ కథనం ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్.. జబ్బార్‌ఖాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రవర్తన సరిగా లేనప్పుడు ఉద్యోగంలో నుంచి ఎందుకు తొలగించకూడదో రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం



సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్ ఆర్టీసీ ఎంప్లాయీస్ నాయకులు

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలోని ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని వైఎస్ఆర్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సూచించారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగన్న, జోనల్ నాయకులు శ్రీపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, రాబర్ట్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బి.ఎల్ శాస్త్రీ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీలు లేని డిపోలలో నూతన కమిటీలు ఏర్పా టు చేయాలని తీర్మానం చేశారు. త్వరలోనే కర్నూ లు, నంద్యాల జిల్లాలకు చెందిన ఉద్యోగులతో భారీ ఎత్తున సమావేశం నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ లేదని తప్పుడు ప్రచారం చేస్తున్న సంఘాలు.. ఏ రోజూ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేయలేదన్నారు. సమావేశంలో అసోసియేషన్ మహిళ విభాగం నాయకురాలు హంసవేణి, లక్ష్మీదేవి, సుధాకర్, ఈశ్వరయ్య గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బింధు మాధవ్



హాజరైన విద్యార్థులు

- మొబైల్‌కు వచ్చే లింక్‌లు క్లిక్ చేయొద్దు
- బ్యాంకు వాళ్లెవరూ ఓటీపీ అడగరు
- సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 నంబరుకు ఫోన్ చేయండి
- జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు సిటీ: రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బింధు మాధవ్ సూచించారు. శనివారం నగర శివారులోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీల్లో సైబర్ నేరాలపై అవగహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. చదువుకున్న వాళ్లు కూడా ఇటీవల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొరియర్ పేరుతోనూ మోసాలు జరుగుతున్నాయని, చైల్డ్‌ఫోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతోను, డిబెట్ కార్డు మోసాలు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 కోట్లు ఇస్తామని, వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తదితర నేరాలకు పాల్పడుతున్నారన్నారు. స్మార్ట్ ఫోన్లు మంచి కోసం ఉపయోగించుకుంటే జీవితం సాఫీగా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి ఆకర్షణకులోనై మోసపోకూడదన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి ఎక్కువగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను సెట్ చేసుకుని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో www.cybercrime.gov.in ఫిర్యాదులు చేయాలని సూచించారు.కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాదు, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, జి.పుల్లయ్య కాలేజీ డీఎన్ ఆఫ్ అడ్మిన్ గిరిధర్, సీఐలు అబ్దుల్ గౌస్, శ్రీధర్, సైబర్ టెక్నికల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

హెచ్‌డీసీ నిధుల గోల్‌మాల్‌పై రగడ



చాగలమర్రిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చాగలమర్రి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధుల గోల్‌మాల్‌పై రోజురోజుకు వివాదం ముదురుకుంటోంది. వాట్సాప్ వేదికగా డాక్టర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత ఏడాది డీడీఓగా బాధ్యతలు నిర్వహించిన వైద్యాధికారి షేక్.ఇమ్రాన్‌పై నిధులు దుర్వినియోగం చేయినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో డీడీఓ బాధ్యతలను వైద్యురాలు పి.అంజలికి అప్పగించారు. ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత పీహెచ్‌సీకి సంబంధం లేని వ్యక్తి ఖాతాలోకి రూ.2.50 లక్షలు జమ చేయడం తెలుసుకుని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వైద్యులు షేక్.ఇమ్రాన్, అంజలి మధ్య వివాదం నడుస్తోంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడైన ఎంపీపీ వీరభద్రుడు, సిబ్బందితో తనపై డాక్టర్ షేక్.ఇమ్రాన్ అసత్య ఆరోపణలు, ఫిర్యాదులు చేయిస్తుండటంతోపాటు తనకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవుతున్నారని డాక్టర్ అంజలి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణంతో ఆసుపత్రిలో చేరిన సమయంలో ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌తో ఇటీవల తనిఖీ చేయించి విధులకు దుమ్మా కొట్టినట్లు పత్రికలకు ప్రకటన ఇచ్చి వేధిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి ప్రభుత్వ ధనాన్ని కాపాడాలని ఆమె వాట్సాప్ వేదికగా కోరారు.

ఆటో బోల్తా వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామం వద్ద 40వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన నాగరాజు(25) మృతి చెందాడు. ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నాగరాజు తన స్నేహితులతో కలిసి మైదుకూరుకు ఆటోలో వెళ్లాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. పెద్దబోధనం సమీపంలో నాగరాజు ఆటోను డ్రైవింగ్ చేస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజును అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వీఓఏ ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణం



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వీబీకే నరసింహులు

ఎమ్మిగనూరురూరల్: అధికార పార్టీ నేతల నిర్వాకంతో కర్నూలు జిల్లా కలుగొట్ల గ్రామానికి చెందిన వెలుగు వీఓఏ (బుక్ కీపర్) నరసింహులు శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చాలా ఏళ్లుగా ఇతను వెలుగులో వీఓఏగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ పార్టీ నాయకులు తమ వారికి వీఓఏ అవకాశం కల్పించాలని వెలుగు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ మేరకు వెలుగు అధికారులు తమకు అనుకూలంగా లేని వారిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కొత్తవారి జాబితాను కూడా ప్రజాప్రతినిధి ఆదేశాలతో సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలుగొట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రజాప్రతినిధికి ముడుపులు ఇచ్చి వీఓఏ పోస్టు దక్కించుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న నరసింహులు తీవ్ర మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండలంలో 36 మంది వీఓఏలు పనిచేస్తుండగా ఇందులో కొత్త మంది అధికారపార్టీ నాయకుల అండదండలతో జాబితాలో పేర్లు పదిలం చేసుకోగా మిగతా వారి పేర్లు తొలగించి కొత్తవారి పేర్లు చేర్చారనే చర్చ సాగుతోంది. కాగా రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా డోన్ మండలంలోని కొత్తబురుజు గ్రామ వెలుగు వీఓఏ (బుక్ కీపర్) వెంకట్రామిరెడ్డి రాజకీయ నేతల బెదిరింపులతో మానసికంగా కుంగిపోయి గుండెపోటుతో మృతి చెందాడు.

ప్రాథమిక దశలోనే వైద్యం పొందాలి



విద్యార్థులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్): ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు ప్రాథమిక దశలోనే వైద్యం పొందాలని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక హోలీక్రాస్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా తొలి దశలోనే వ్యాధుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆరోగ్య వైద్య సిబ్బందితో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార వయస్సుతోపాటు పెరుగుదల, అభివృద్ధి ఆలస్యం, 30 రకాల తీవ్ర స్థాయిలో ఉన్న వ్యాధులను గుర్తించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. డాక్టర్ కాంతరావునాయక్ మాట్లాడుతూ ప్రతి రోజు 30 మందికి చొప్పున జిల్లాలోని 1,51,084 మంది విద్యార్థులకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శారదాబాయి, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి పార్వతి

ఆదోని అర్బన్: కన్న తల్లిపైనే కుమారుడు దాడి చేసిన ఘటన శనివారం పట్టణంలో ని విక్టోరియాపేటలో చోటుచేసుకుంది. బాధితురాలు పార్వతిని కుమార్తెలు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వివరాలు.. పార్వతికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నాగరాజు తాగుడుకు బానిసై బెంగళూరుకు వలస వెళ్లడంతో ఉన్న ఇల్లును అద్దెకు పార్వతి తన కూతుళ్ల వద్ద జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో గురువారం బెంగళూరు నుంచి వచ్చిన కుమారుడు ఇల్లు తన పేరుపై రాయించాలని గొడవపెట్టుకున్నాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో దాడి చేశాడు. గాయపడిన పార్వతిని కూతుళ్లు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.



జేసీబీతో మట్టిని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశం

మట్టి మేస్తున్నారు!

బొమ్మలసత్రం: నంద్యాలలో టీడీపీ నేతలు భూకబ్జాలు, వైన్‌షాప్‌ల నుంచి అక్రమ వసూళ్లు చాలవని మట్టిని కూడా మింగేస్తున్నారు. పొన్నాపురం కాలనీకి చెందిన ఓ టీడీపీ నాయకుడు మంత్రి అండదండలతో మట్టిని కొల్లగొట్టి ట్రాక్టర్లతో విక్రయిస్తున్నాడు. ఇదంతా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్సార్బీసీ కాలనీలోని టిడ్కో గృహాల సమీపంలో గత ప్రభుత్వంలో పేదలకు జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం టీడీపీ నేతలకు ఎక్కడా మట్టి లభించకపోవటంతో లేఅవుట్‌పై కన్నుపడింది. శనివారం మట్టిని అక్రమంగా తరలించే కార్యక్రమం ప్రారంభించారు. జేసీబీ సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని విక్రంచేపని మొదలు పెట్టారు. లేఅవుట్ నుంచి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సాంబారులో పడి బాలుడి మృతి



మంగళి జగదీష్ (ఫైల్)

గోనెగండ్ల: సెల్‌ఫోన్ ఐదేళ్ల బాలుడి ప్రాణం తీసింది. ఈఘటన మండలంలోని వేముగోడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన మంగళి వీరేష్, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో కలిసి వేముగోడు గ్రామానికి వలస వచ్చాడు. వీరేష్ బార్బర్ దుకాణంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలోనే తమ సమీప బంధువుల ఇంట్లో శుభకార్యం జరుగుతుండటంతో అందరూ వెళ్లారు. శుభకార్యం జరిగే ఇంటి పక్కన గుడిసెలో వంటలు చేసి పెట్టారు. కాగా వీరేష్ కుమారుడు జగదీష్(5) సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుకుంటూ వంటలు వండిన గుడిసెలోకి వెళ్లాడు. అక్కడ సాంబార్ గిన్నెపై కూర్చున్నాడు. పిల్లవాడి బరువుకు సాంబర్ గిన్నెపై ఉన్న మూత జరిగిపోవడంతో అందులో పడిపోయాడు. వేడికి తాళలేక కేకలు వేయడంతో బంధువులు పరుగున వెళ్లి బయటకు తీశారు. బాలుడికి నడుము భాగం నుంచి కిందకు ఎక్కువ శాతం కాలడంతో వెంటనే ఇంకు పూసి, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. కాగా బాలుడి మృతిపై తమకు ఫిర్యాదు అందలేదని సీఐ గంగాధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకులు

కొత్తపల్లి: మండల శివారులో శనివారం జరిగిన రోడ్డుప్రమాదం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్తపల్లికి చెందిన సలీంబాషా కుమారుడు మన్సూర్, పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన చాంద్‌బాషా కుమారుడు ఇర్ఫాన్ కొత్తపల్లి నుంచి బైక్‌పై మద్దూరు గ్రామానికి బయలుదేరారు. మండల శివారులోకి వెళ్లగానే పొలంలో నుంచి రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని, దాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొంది. ప్రమాదంలో యువకులిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో ప్రయాణికులు అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ఎం.కేశవ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

'మధ్యాహ్న భోజనం' పాత ఏజెన్సీకే అప్పగింత



విద్యార్థులకు రాగి జావా పంపిణీ చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకురాలు బీబీ

రుద్రవరం: మండల పరిధిలోని చిలకలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని త్రిసభ్య కమిటీ సభ్యులు(తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంఈఓ కోటయ్య, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి) పాత నిర్వాహకురాలు బీబీకే అప్పగించారు. దీంతో శనివారం ఆమె విద్యార్థులకు భోజనం తయారు చేసింది. బీబీ 24 ఏళ్లుగా అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తూ వండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు అభియోగాలు ఉన్నాయంటూ మరో మహిళ సుజాతకు ఏజెన్సీని అప్పగించారు. దీంతో బీబీ హైకోర్టును ఆశ్రయించడంతో ఈనెల 11న ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో త్రిసభ్య కమిటీ సభ్యులు. ఏజెన్సీ నిర్వహణ బాధ్యతలను బీబీకి అప్పగించారు. కాగా మధ్యాహ్న భోజనాన్ని సర్పంచు ప్రసాదరెడ్డి పరిశీలించారు.

20 నుంచి డేటా అనలిస్ట్ ఉచిత శిక్షణ

శిరివెళ్ల: ఈనెల 20 నుంచి యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా అనలిస్ట్ ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి శనివారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన యువతీయువకులు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటో సైజ్ కలర్ ఫొటోలు అందచేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.